

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి పోచమ్మతల్లి విగ్రహప్రతిష్ఠ ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ విశ్వనాథ్‌గౌడ్, సభ్యులు

ఎమ్మెల్యేను కలిసిన పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్

చంపాపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని పోచమ్మతల్లి నూతన ఆలయంలో ఈనెల 6నుంచి 12వరకు కొనసాగనున్న పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ, బోనాల వేడుకలకు విచ్చేయాలని కోరుతూ శుక్రవారం ఆలయ కమిటీ చైర్మన్ ఎరుకల విశ్వనాథ్‌గౌడ్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బొక్కా సదానంద్‌రెడ్డి, రవిముదిరాజ్, ఆలయ కమిటీ సభ్యులు చీర తిరుమలేష్, చేగొని మల్లేష్‌గౌడ్, జగదీష్‌గౌడ్, రాఘవేంద్ర, సాయి పాల్గొన్నారు.



ఇంజాపూర్ వక్ఫ్‌బోర్డు భూమిలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న మైనారిటీలు

ఇంజాపూర్‌లో సామూహిక ప్రార్థనలు

హయత్‌నగర్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్‌లోని సర్వేనంబర్ 247లో వక్ఫ్‌బోర్డు భూమిలో శుక్రవారం స్థానిక మైనారిటీలు సామూహిక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ మైనారిటీ అధ్యక్షుడు మహ్మద్‌గౌస్ పాష, నాయకులు మహ్మద్ మజర్, యాసీన్, ముజీబ్‌ఖాన్, ఇల్యాస్, ఫెరోజ్‌ఖాన్, ఖురేషి, రషీద్, బాబా, అబ్దుల్లా, రహమాన్, జహంగీర్‌పాష, అబ్దుల్ రహమాన్ పాల్గొన్నారు.



వరదనీటి సమస్యలను వివరిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టాలి : రాగుల

వనస్థలిపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వరదనీటి సమస్యలు తలెత్తకుండా విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టాలని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ గణపతిరెడ్డితో కలిసి కార్పొరేటర్ జాతీయ రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులు సమీపంలోని కాలనీలైన అభ్యుదయనగర్, జనప్రియకాలనీల రోడ్ల కంటే రహదారి పనులు అధిక ఎత్తులో నిర్మిస్తుండడంతో వరదనీరుతో ఈ కాలనీలు మునిగిపోయే ప్రమాదం పొంచి ఉందన్నారు. కాలనీల రోడ్లకు అనుగుణంగా ఎత్తుపల్లాలు చూసుకుని రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కోరారు. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ మాట్లాడుతూ కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పవన్‌కుమార్‌గుప్తా, పీవీఎన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ ఈవోగా లావణ్య



చంపాపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయ కార్యనిర్వాహణాధికారి(ఈవో)గా ఎన్.లావణ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. యూసుఫ్‌గూడ శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం ఈవోగా పనిచేసిన ఎన్.లావణ్య గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1 అధికారిణిగా పదోన్నతి పొందుతూ కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ ఈవోగా నియమిస్తూ దేవాదాయశాఖ కమిషనర్ ఎం.హనుమంతురావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేసిన ఎం.శ్రీనివాసశర్మ శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవోగా బదిలీపై వెళ్లారు.



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌జేడీ సోమిరెడ్డి తదితరులు

ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కవాడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆర్‌జేడీ సోమిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలికవసతుల కల్పనకు స్వచ్ఛంద సంస్థలు కృషి చేయడం అభినందనీయం అన్నారు. యూత్ ఫర్ సేవాకు చెందిన 70 మంది వలంటీర్లు హాజరై పాఠశాలలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. అనంతరం తరగతి గదుల గోడలపై ఆయా సబ్జెక్టులకు సంబంధించిన ఆర్ట్‌లను వేశారు. అదేవిధంగా నాలుగు నూతన కంప్యూటర్లను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం దశరథరెడ్డి, జయప్రకాష్, భువనేశ్వరీ, స్వర్ణలత, దినేష్, శ్రీనివాస్, రాములయ్య, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, యూత్ ఫర్ సేవా వలంటీర్లు సునీల్‌కుమార్, రామేశ్వరరావు, వంశీ, యోగేశ్వరరావు పాల్గొన్నారు.



ఆర్టీసీ కార్గో కౌంటర్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీటీఎం మధుసూదన్

మూసారాంబాగ్‌లో ఆర్టీసీ కార్గో కౌంటర్ ప్రారంభం

చాదర్‌ఘాట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ మూసారాంబాగ్ కార్గో కౌంటర్‌ను డిప్యూటీ సీటీఎం మధుసూదన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కౌంటర్ ప్రతిరోజు ఉదయం 11గంటల నుంచి రాత్రి 11గంటల వరకు పనిచేస్తుందని వివరించారు. కార్గోసేవలను ఉపయోగించుకుని తక్కువ ధరలో వేగంగా ఆయా గమ్యస్థానాలకు చేరవేస్తుందని ఆయన వివరించారు. కార్గో ఏటీఎం వెంటనారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర వరకు కార్గో సేవలందించగలమన్నారు. దిల్‌సుఖ్‌నగర్ డిపో మేనేజర్ సమత బుకింగ్ సిస్టమ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కార్గో మార్కెటింగ్ టీమ్ శ్రవణ్, ప్రదీప్, సత్యనారాయణ, అమరేందర్‌రాజు, మురళీ, సెంటర్ నిర్వాహకుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వనస్థలిపురం పీఎస్‌ను తనిఖీ చేసిన సీపీ

వనస్థలిపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌ను రాచకొండ సీపీ సుధీర్‌బాబు శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీఎస్ పరిధిలో ఇటీవల జరిగిన పలు సంఘటనలకు సంబంధించిన విషయాలను ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డిలను అడిగి తెలుసుకున్నారు. అలాగే శాంతి భద్రతలపై చేపడుతున్న విధి విధానాలు, నేరాల నియంత్రణ, కేసుల ఛేదనపై పలు సూచనలు చేశారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న పలు రికార్డులను పరిశీలించి, సిబ్బంది పనితీరుపై చర్చించినట్లు తెలిసింది.

సుప్రీంకోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలి

చాదర్‌ఘాట్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ రాష్ట్రాల పరిధిలో అమలు చేసుకోవచ్చు అని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలంగాణ సోషలిస్ట్ స్టుడెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెళ్ల మహేశ్‌కుమార్ ప్రకటించారు. శుక్రవారం మూసారాంబాగ్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేసేందుకు పార్లమెంట్‌లో ఆర్డినెన్స్ చేసి అన్ని రాష్ట్రాల్లో అమలుకు కృషి చేయాలని కోరారు. గతంలో మాదిరిగా మళ్లీ వెనక్కి తీసుకోవడానికి వీలు లేకుండా బిల్లు రూపకంగా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. వర్గీకరణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పిస్తూ ఎమ్మార్పీఎస్, దాని అనుబంధ సంఘాల నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గందమల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గ్యార సతీష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కె.ప్రభాకర్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.



అంబేడ్కర్‌కు విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడుతున్న తెలంగాణ సోషలిస్ట్ స్టుడెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మహేష్‌కుమార్

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

సైదాబాద్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఐఎస్‌సదన్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ నేతలు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఏర్పుల కృష్ణమాదిగ, భూమయ్య, రమేష్‌మాదిగ, ఈశ్వర్‌మాదిగ, శ్రీనివాస్, మునీష్ పాల్గొన్నారు.



ఐఎస్‌సదన్ చౌరస్తాలో సంబరాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ నేతలు

ఎమ్మార్పీఎస్ నేతల సంబరాలు

సరూర్‌నగర్ : సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై వెలువరించిన తీర్పు మాదిగల్లో ఆత్మ స్థైర్యాన్ని నింపిందని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి బొర్ర రవిమాదిగ అన్నారు. కోర్టుతీర్పు నేపథ్యంలో శుక్రవారం బాలాపూర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సమితి నేతలు, స్థానిక మాదిగలు సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చి మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చేపట్టిన ఉద్యమం ఫలితమే సుప్రీంకోర్టు తీర్పు అని అన్నారు. ఈ తీర్పును రాష్ట్రాలు అమలు చేస్తే మాదిగల్లోని ఉప కులాలకు సరైన న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

వర్గీకరణపై సుప్రీం తీర్పు హర్షణీయం

సరూర్‌నగర్ : ఎస్సీ వర్గీకరణపై గురువారం సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు చరిత్రాత్మకమని, ఈ తీర్పుతో మంద కృష్ణమాదిగ ఆశయం సిద్ధించినట్టయిందని బడంగ్‌పేట్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ సూర్లగంటి అర్జున్ అన్నారు. సుప్రీం తీర్పు హర్షణీయమని, యావత్ మాదిగజాతికి ఇది శుభవార్త అని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం బడంగ్‌పేట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంద కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన దశాబ్దాల పోరాటానికి సార్థకత చేకూరిందని, సుప్రీం తీర్పును రెండు తెలుగు రాష్ట్రాల్లో కచ్చితంగా అమలు చేయాలని కోరారు. వర్గీకరణతో మాదిగలు, మాదిగ ఉపకులాలకు చెందిన వారికి సరైన న్యాయం జరిగే అవకాశం ఉన్నదని అర్జున్ పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో మంద కృష్ణ కృషి మరువలేనిది

అబ్దుల్లాపూర్‌మెట్ : ఎస్సీ వర్గీకరణ పోరాటంలో మంద కృష్ణమాదిగ కృషి మరువలేనిదని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలిమండ్ల గోవర్ధన్ కొనియాడారు. శుక్రవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని వీహెచ్‌పీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 30ఏళ్ల మంద కృష్ణ పోరాటానికి ఫలితం దక్కడం సంతోషకరమన్నారు. ధర్మాన్ని నమ్ముకుని ముందుకు వెళ్లిన మంద కృష్ణకు గొప్ప విజయం సాధించారన్నారు. వర్గీకరణ కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన ఆయన కృషిని జాతి ఎప్పటికి మరిచిపోదన్నారు. ఈ సందర్భంగా మంద కృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు.



బాలాపూర్‌లో ఎమ్మార్పీఎస్ నేతల సంబరాలు

హైడ్రాకు ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం

- హత్తిగూడ చెరువు వరకు ఆరు ఫీట్ల వెడల్పుతో కాల్వ ఏర్పాటు

హయత్‌నగర్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని హత్తిగూడ చెరువు ఆక్రమణపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు ఇచ్చిన ఫిర్యాదుతో అధికార యంత్రాంగంలో కదిలిక వచ్చింది. నార్త్ ట్యాంకు డివిజన్ పరిధిలో ఉన్న ఈ చెరువును రక్షించే పనిలో పడ్డారు అధికారులు. ఏఈ నాగరాజు ఆదేశం మేరకు శుక్రవారం మూడు జేసీబీలను ఏర్పాటు చేసి వర్షం నీరు నేరుగా చెరువులోకి వెళ్లేలా కల్వర్టు నుంచి 6ఫీట్ల వెడల్పుతో కాల్వను తీస్తున్నారు. హయత్‌నగర్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాసాల నర్సింహయాదవ్, నార్త్ ట్యాంకు డివిజన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డిలు దగ్గరుండి కాల్వను తీయిస్తున్నారు. వర్షం కురిసినప్పుడు నీరు బాలాజీనగర్, పుల్లారెడ్డి స్వీట్‌హౌస్, క్రీడా నుంచి నీరు లోతట్టు ప్రాంతాల గుండా లక్ష్మీభవానీకాలనీ మీదుగా హత్తిగూడ చెరువుకు చేరుకుంటుంది. పది సంవత్సరాలుగా కల్వర్టు మూసుకుపోయి లక్ష్మీభవానీకాలనీతో పాటు అనేక కాలనీలు ముంపునకు గురి అయ్యాయి. ప్రస్తుతం కల్వర్టు నుంచి 6ఫీట్ల వెడల్పుతో కాల్వ తీసి చెరువులో వేస్తుండడం వల్ల ముంపు సమస్య తప్పుతుంది. కబ్జాను అరికట్టడానికి అవకాశం ఉంది.

సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలి.. స్థానికులు

జీహెచ్‌ఎంసీ నార్త్ ట్యాంకు డివిజన్ ఇరిగేషన్, అబ్దుల్లాపూర్‌మెట్ ఇరిగేషన్ అధికారులు జాయింట్ సర్వే చేసి హత్తిగూడ చెరువుకు హద్దులు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ప్లాట్లు ధర తక్కువ అనగానే అనేక మంది ప్లాట్లు కొనుగోలు చేశారు. సీపీఐ నాయకులు ఆధారాలతో అప్పటి హయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణికి ఫిర్యాదు చేసినా స్పందించలేదని, పైగా బిల్డర్లకే మద్దతు తెలిపిందన్నారు. ఈ వ్యవహారంలో లక్షల రూపాయలు చేతులు మారాయని వారు ఆరోపించారు. అదేవిధంగా బాగ్ హయత్‌నగర్‌లో లేని 308 సర్వేనంబర్ సృష్టించి సుమారు రూ.200 కోట్ల విలువ చేసే పది ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేస్తున్నారని సీపీఐ మండల కార్యదర్శి శేఖర్‌రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ విచారణ జరిపితే అసలు విషయం బయటకు వస్తుందన్నారు.



హత్తిగూడ చెరువు వరకు 6 ఫీట్ల వెడల్పుతో తీస్తున్న కాల్వ

సెక్రటేరియట్ ఎదుట నిరసన పిలుపు నేపథ్యంలో..
తాజా మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సెక్రటేరియట్ ఎదుట గాంధేయ మార్గంలో నిరసన పిలుపుతో శుక్రవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని తాజామాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. గత ప్రభుత్వ హయాంలోని పెండింగ్ బిల్లులను చెల్లించిన తర్వాతనే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేస్తూ శుక్రవారం సెక్రటేరియట్ ఎదుట గాంధేయమార్గంలో నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పోలీసులు మాజీ సర్పంచ్‌లను ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొన్ని గంటల తర్వాత వారిని వదిలిపెట్టారు. అరెస్టు అయిన వారిలో మాజీ సర్పంచ్‌లు పోచంపల్లి సుధాకర్‌రెడ్డి, కరిమెల వెంకటేష్, ఎర్రవెల్లి లతాశ్రీగౌరిశంకర్‌చారి, చెరుకు కిరణ్‌కుమార్‌గౌడ్, బుర్ర వీరస్వామి, కొర్ర లావణ్యరాధాకృష్ణ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తే సబితను టార్గెట్ చేస్తారా ?

ఎల్‌బీనగర్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తే ఎమ్మెల్యే సబితను టార్గెట్ చేస్తారా అని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ ప్రశ్నించారు. శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రశ్నించే గొంతును నొక్కలేరన్నారు. దొంగలే దొంగ అన్నట్లు కాంగ్రెస్ నాయకులు సబితారెడ్డిని విమర్శించడం శోచనీయమన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, గొడుగు శ్రీనివాస్, ఆకుల అరవింద్‌కుమార్, కొండ్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, శ్రీనివాస్, వెంకటేష్‌గౌడ్, నవీన్, అనురాధ, శంకర్ పాల్గొన్నారు.

పండ్ల మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా శ్రీనివాస్

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారు బాటసింగారంలోని పండ్ల మార్కెట్ నూతన ఉన్నత శ్రేణి కార్యదర్శిగా లోకిని శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మొన్నటి వరకు ఇక్కడ డిప్యూటేషన్‌పై పని చేసిన చిలుక నర్సింహారెడ్డి ఆయన రెగ్యులర్ పోస్టు అయిన మలక్‌పేట్ గంజి మార్కెట్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మార్కెట్‌లో రైతులు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తనవంతు కృషి చేస్తానన్నారు.

250 మందితో ఏవియేటర్స్ మీట్

హైదరాబాద్ సిటీ: విమానయానరంగంలో విశేష సేవలందించిన ఏవియేటర్లతో ఏర్పడిన హైదరాబాద్ ఏవియేటర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఏవియేటర్స్ సమావేశం గురువారం రాత్రి మాదాపూర్‌లోని ఓ సంస్థ షో రూమ్‌లో జరిగింది. హైదరాబాద్ ఏవియేటర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కెప్టెన్ అనిల్ కుమార్ మాట్లాడుతూ ఏవియేషన్ రంగంలో విశేష కృషి చేసిన వారందరికీ ఒక వేదికను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ అసోసియేషన్‌లో 600 మందికి పైగా సభ్యులు ఉన్నారన్నారు. 18 ఏళ్ల క్రితం తొలిసారిగా ఏవియేటర్స్ మీట్ ఏర్పాటు చేశామని, ఇప్పుడు 250 మందికి పైగా పాల్గొన్నారని తెలిపారు.

పీజీ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ)లో ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల్లో 2024-25కు సంబంధించిన అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. కామన్ యూనివర్సిటీస్ ఎంట్రెన్స్ టెస్ట్(సీయూఈటీ) 2024లో స్కోరు సాధించిన అభ్యర్థులు తాము ఎంచుకున్న కోర్సుల్లో అడ్మిషన్ కోసం ఈనెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. మొత్తం 442 సీట్ల భర్తీ నిమిత్తం ఈనెల 22నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహిస్తామని, సెప్టెంబర్ 2నుంచి తరగతులు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



సావిత్రి బెహ్రా(ఫైల్)

వనస్థలిపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మహిళ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన సావిత్రి బెహ్రా(40) కూలీ పనులు చేసుకుంటు వనస్థలిపురం విజయశ్రీ కాలనీలో తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నారు. కాగా పని నిమిత్తం ఆమె బంధువులైన సంజు బెహ్రా, అలేఖ్య ప్రసాద్ ముగ్గురు కలిసి ద్విచక్ర వాహనంపై మన్సూరాబాద్ నుంచి హయత్‌నగర్‌కు శుక్రవారం ఉదయం వెళ్తున్నారు. ఈ క్రమంలో వనస్థలిపురం ఆటోనగర్ హరిణవనస్థలి వద్దకు రాగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ వీరిని ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వస్తున్న ముగ్గురు కిందపడిపోయారు. సావిత్రి బెహ్రా తలపై నుంచి లారీ వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

సరూర్‌నగర్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. జిల్లెలగూడలో నివసించే శివయ్య(50) రోజు కూలీ. ఎప్పటిలాగే గత నెల 20వ తేదీన బాలాపూర్ చౌరస్తాలోని కూలీల అడ్డా వద్దకు వెళ్తుండగా, ఇక్కడి బావర్చీ హోటల్ వద్ద గల యూటర్న్ దగ్గర మలుపు తిరుగుతున్న ఆర్టీసీ బస్సు అతడిని ఢీకొట్టింది. దాంతో తీవ్ర గాయాలపాలైన శివయ్యను ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మీర్‌పేట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తీసుకున్న అప్పు ఇవ్వమన్నందుకు మహిళ హత్య

కొత్తపేట: తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వమన్నందుకు ఓ మహిళ దారుణహత్యకు గురైంది. ఈ సంఘటన ఎల్బీనగర్ శివగంగాకాలనీ సమీపంలో భరత్‌నగర్-2లో శుక్రవారం రాత్రి జరిగింది. భరత్‌నగర్-2లో ఉండే నర్సమ్మ(52).. అదే బస్తీలో ఉండే సరోజినీకి రూ.20వేల అప్పు ఇచ్చింది. అయితే అప్పు తిరిగి ఇచ్చే విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈక్రమంలో శుక్రవారం రాత్రి సరోజినీ ఆవేశంలో పక్కనే ఉన్న సుత్తెతో నర్సమ్మ ముఖంపై గట్టిగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. సరోజినీని అదుపులో తీసుకుని విచారిస్తున్నారు.

రజక ఫెడరేషన్‌కు నిధులను కేటాయించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రచారి

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రజక ఫెడరేషన్‌కు బడ్జెట్‌లో వెయ్యి కోట్ల నిధులను కేటాయించి.. పాలక మండలిని ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రచారి డిమాండ్ చేశారు. తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య రంగారెడ్డి ముఖ్య నాయకుల సమావేశం కుంట్లూర్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రవీంద్రచారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లు కులవృత్తిదారుల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. సమాజంలో నేటికి రజకవృత్తిదారులు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రజకవృత్తిదారులకు ఉన్నటువంటి జీవోల ఆధారంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయకపోతే ప్రజా క్షేత్రంలో ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, సాంఘిక భద్రత చట్టాన్ని రూపొందించాలని, పింఛన్లు మంజూరు, ట్యాంక్‌బండ్‌పై ఐలమ్మ విగ్రహం ఏర్పాటు, రుణాలు మంజూరు చేయాలని రజకవృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేతరాజు నర్సింహ, ఎల్లయ్య, భిక్షపతి, సైదారావు, భారతరాజు నర్సింహ, ఎస్. నర్సింహ పాల్గొన్నారు.



రజక వృత్తిదారుల సమాఖ్య సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రచారి

ఆపరేషన్ ముస్కాన్‌లో 326 మంది చిన్నారులను కాపాడిన అధికారులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): భిక్షాటన చేస్తున్న పిల్లలు, బాల కార్మికులను కాపాడేందుకు ఏటా ప్రభుత్వం చేపడుతున్న ఆపరేషన్ ముస్కాన్ 10వ ఎడిషన్‌లో రాచకొండ కమిషనరేట్ పరిధిలో 326 మంది చిన్నారులను అధికారులు రక్షించారు. కార్మికశాఖ, రెవెన్యూ, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, చైల్డ్‌లైన్, పోలీసులు, ఎన్‌జీఓలు సంయుక్తంగా జూలై 1 నుంచి జూలై 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించారు. అధికారులు రక్షించిన చిన్నారుల్లో తెలంగాణకు చెందిన 103 మంది బాలురు, ఐదుగురు బాలికలు, ఇతర రాష్ట్రాలకు చెందిన 208 మంది బాలురు, 10 మంది బాలికలు ఉన్నారు. పిల్లలతో పనులు చేయిస్తున్న 155 మందిపై కేసులు నమోదు చేశామని రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టీ. ఉషారాణి తెలిపారు.

‘ప్రాణం’ తీసిన ‘అనుమానం’

- భార్యను కడతేర్చిన భర్త
- హస్తినాపురంలో ఘటన



జ్యోతి మృతదేహం

సరూర్‌నగర్ : భార్యపై ‘అనుమానం’ పెంచుకున్న ఓ భర్త.. విచక్షణ కోల్పోయి క్షణికావేశంలో ఆమె ‘ప్రాణం’ తీశాడు. మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హస్తినాపురం అగ్రికల్చర్ కాలనీలో గురువారం రాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ కీసరి నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్‌కు చెందిన బొల్లారం రాజు(47) తన భార్య జ్యోతి(33), ఓ కూతురుతో కలిసి నాలుగేళ్లుగా హస్తినాపురంలోని అగ్రికల్చర్‌కాలనీ ఉషోదయా రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. కొన్నాళ్లుగా రాజు తన భార్యపై అనుమానంతో తరచుగా గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం సైతం ఇద్దరి మధ్య గొడవ మొదలై మాటా మాటా పెరిగి కొట్టుకునే దాకా వెళ్లింది. ఆవేశానికి లోనైన రాజు విచక్షణ కోల్పోయి ఇంట్లో ఉన్న ఇనుప పాణ(స్పానర్)తో జ్యోతి తలపై బలంగా కొట్టాడు. దాంతో తీవ్ర రక్తస్రావమై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న మీర్‌పేట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, పంచనామా నిర్వహించి జ్యోతి మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. మృతురాలి తల్లి అలివేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కాగా నిందితుడు రాజు పోలీసులకు లొంగిపోయినట్టు తెలిసింది.

గంటల్లో దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు

- రోడ్డు ప్రమాదం ఘటనలో రోడ్డును శుభ్రం చేసిన అధికారులు
- అభినందించి రివార్డులు అందించిన సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): దోపిడీకి పాల్పడి కారుతో పరారైన నిందితులను నిమిషాల వ్యవధిలో పట్టుకున్న అధికారులను, చౌటుప్పల్ రోడ్డు ప్రమాదంలో రోడ్డును శుభ్రం చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించిన సిబ్బందిని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అభినందించి, రివార్డులు అందించారు. కమిషనరేట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఈనెల 2 రాత్రి 12గంటల సమయంలో పర్యాద రాఘవేందర్‌రెడ్డి తన కారులో విపాసన యూటర్న్ వద్ద నుంచి వస్తున్నాడు. పల్సర్ బైక్‌పై అడ్డగించిన పొన్నాడ క్రాంతి, రావుల రాహుల్, రోహిత్‌లు రాఘవేందర్‌రెడ్డిపై కర్రలతో దాడిచేసి, కారును తీసుకెళ్లి పోయారు. బాధితుడు వెంటనే 12.44 గంటలకు డయల్ 100కు సమాచారమందించగా, 6 నిమిషాల్లో బ్లూకోల్ట్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు వనస్థలిపురం ఎస్‌హెచ్‌ఓ అశోక్ రెడ్డి, పెట్రోమొబైల్ 2 హెడ్‌కానిస్టేబుల్ నీలేష్‌కుమార్, హోంగార్డు సురేందర్, బ్లూకోల్ట్ కానిస్టేబుల్ రామకృష్ణ, హోంగార్డు ఐలయ్య, అంబులెన్స్ డ్రైవర్ కృష్ణగౌడ్ స్థానికులతో కలిసి నిందితుల కోసం వేట ప్రారంభించారు. రాత్రి 1.20 గంటలకు కమ్మగూడ వద్ద దొంగిలించిన కారులో ఉన్న ఇద్దరు నిందితులు క్రాంతి, రాహుల్‌లను అరెస్ట్ చేశారు. మరో నిందితుడు రోహిత్ పరారీలో ఉన్నాడు. నిమిషాల వ్యవధిలో కేసును ఛేదించిన అధికారులు, సిబ్బందిని సీపీ అభినందించి సత్కరించారు.



రివార్డులు అందించి అభినందిస్తున్న సీపీ సుధీర్‌బాబు

రోడ్డును ఊడ్చిన పోలీసులు..

చౌటుప్పల్ జాతీయ రహదారిపై బీరు సీసాల లారీ, ఉల్లిపాయల లోడు లారీలు ఢీకొన్నాయి, ఈ ప్రమాదంలో రోడ్డుపై బీరు సీసాలు పగిలిపడి భారీగా ట్రాఫిక్ స్తంభించింది. వాహనదారులకు ప్రమాదకరంగా మారిన బీరుసీసా గాజుముక్కలను ఇన్‌స్పెక్టర్ ఎం.విజయ్‌మోహన్, ఏఎస్‌ఐ కే. శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుళ్లు ఎం.వెంకటరెడ్డి, ఎస్‌కే వసియుద్దీన్, డీ.శంకర్, కె.విజయ్‌కుమార్, డీ.వీరభద్రయ్య, పీ. శోభన్‌లు శుభ్రం చేసి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. వీరి సేవలను గుర్తించిన సీపీ కమిషనరేట్‌లో అభినందించి రివార్డులు అందించారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | రాజు : 9985402786